ప్రజాశక్తి
బుధవారం 28 ఆగస్టు 2024
5
శ్రీ సత్యసాయి

దళిత రైతులకు న్యాయం చేయండి : కెవిపిఎస్

భూపోరాటంలో నాయకులు, రైతులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని కొండూరు, కొర్లకుంటకు చెందిన దళిత రైతులను న్యాయం చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన దళిత రైతులు కొండూరు పొలంలోని ప్రభుత్వ భూమిలో దుక్కి దున్ని విత్తనాలు వేశారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, రాము, రాజు, అనిల్, నరసింహప్ప, గంగాధరప్ప మాట్లాడుతూ కొండూరు పొలంలోని ప్రభుత్వ భూమిలో దళితులు సాగు చేస్తున్న భూములను వారికే చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆధీనంలో ఉన్న ఈ భూమిని అధికారులు తిరిగి ప్రభుత్వ భూమిగా గుర్తించారన్నారు. దళిత రైతులు సాగు చేస్తున్నత్న దాదాపు 60 ఎకరాల భూమిని సాగులెక్కల్లోకి ఎక్కించి రైతు సంక్షేమ పథకాలను దళిత రైతులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

గడ్డి తిని బతకాలా..?

'సత్యసాయి'కార్మికుల నిరసన

గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆరునెలలుగా తమకు వేతనాలు ఇవ్వకపోతే గడ్డి తిని బతకాలా అని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు పాలకులను, అధికారులను ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. కార్మికులు వేప ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కార్మికులు మాట్లాడుతూ కరువు జిల్లాగా పరిగణింపబడుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగు నీటికేకాక, తాగునీటికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలకు దాదాపు 28 సంవత్సరాలుగా సత్యసాయి తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారన్నారు. సత్యసాయి వాటర్ ప్రాజెక్టులో పని చేస్తున్న దాదాపు 500 మంది పైబడి కార్మికులకు ఆరు మాసాలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. తమ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాగునీటి సరఫరాను నిలిపివేసి నిరసన తెలుపుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారుల నుంచి ఎటువంటి స్పందన కనిపించలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సత్యసాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జగన్, మారుతి, బాషా, ఓబుళేసు, శంకరయ్య, ఆనంతయ్య, జయరాము, కేశవ, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండల పరిధిలోని కొత్తపల్లి తండా పంప్ హౌస్ వద్ద సత్యసాయి నీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు గడ్డితింటూ అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నుంచి కూడా తమకు వేతనాలు సక్రమంగా అందలేదన్నారు. వేతనాల కోసం ప్రతిసారి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా తమను పట్టించుకోలేదన్నారు. తమకు ఆరు నెలల నుండి వేతనాలు రాలేదని దీంతో కుటుంబ పోషణ భారమైందని అన్నారు. కార్మికుల ఇంట్లోని పిల్లల చదువులకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆరు నెలల బకాయి వేతనాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంపు హౌస్ కార్మికులు వెంకటేష్, నాగభూషణ, శ్రీనివాసులు, రామ్మోహన్, షామీర్, కేశవ, శంకర, రామ్మోహన్ రెడ్డి, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- నాసిన్ , బెల్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందే..
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్
- పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల వంటావార్పు

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వంటా వార్పు నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు అయితే తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని భావించి సాగులో ఉన్న భూములను తక్కువ ధరలకే ఇచ్చిన పేద రైతులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం అడుగడుగునా కొనసాగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన నాసిన్, బెల్ భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల వంటావార్పు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలసముద్రం, కావేటి నాగేపల్లి, చిన్న బాబయ్యపల్లి గ్రామాలకు చెందిన నాసిన్, బెల్ భూ నిర్వాసితులు గత మూడు సంవత్సరాల నుంచి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భూములు ఇచ్చిన వారిలో దళితులు, వెనుకబడిన వర్గాల నిరుపేద రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. భూమిని ఇచ్చి వారు సర్వం కోల్పోయారని తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నిర్వాసితులకు సంబంధించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉపాధి సమస్యల పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు జోక్యం చేసుకుని నిర్వాసితులకు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమస్య తెలిసినా పట్టించుకోవడం లేదు..!
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

జిల్లాలో నాసన్, బెల్ నిర్వాసితుల సమస్య తెలియని అధికారులు, ప్రజాప్రతినిధులు లేరు.. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎపిఐఐసి అధికారులందరికీ విజ్ఞప్తులు, రాయబారాలు చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద గత మూడు సంవత్సరాల నుంచి సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. భూములిచ్చిన రైతులకు ఉపాధి లేక వారి కుటుంబాలు గడవడమే కష్టంగా ఉందన్నారు. ఇంత దుర్భర స్థితిలో ఉన్న పేద రైతులను పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నిర్వాసితుల ప్రత్యక్ష పోరాటం చూసేనా అధికారులు, పాలకులు మొద్దు నిద్ర వీడి పునరావసం చెల్లించి, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, నార్సింపల్లి ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేష్, సిపిఎం నాయకులు బాబావలి, తిప్పన్న, భూ నిర్వాసితులు వెంకట్రామిరెడ్డి, నారాయణ, వెంకట లక్ష్మమ్మ, అచ్చమ్మ, గంగమ్మ, రమీజాబి, అశ్వర్థమ్మ, వెంకట్రాముడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పనివాళ్లు కాదు ఆశా వర్కర్లు..!

గోడలకు రంగులు వేసే పనిలో ఆశావర్కర్లు (ఇన్‌సెట్‌లో గదిని శుభ్రం చేస్తున్న ఆశా కార్యకర్త)

ప్రజాశక్తి - కదిరి టౌన్

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఆశా వర్కర్లను నియమించాయి. వారితో ప్రజలకు వైద్యసేవలు అందిచాల్సిన వైద్యసిబ్బంది ఆశావర్కర్లను ఇతర పనులకు వినియోగిస్తున్నారు. ఆశా వర్కర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్వీపర్లగా భావించారో ఎమో కానీ వారితో చెత్త శుభ్రం చేయిస్తున్నారు. ఆశావర్కర్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అడ్డమైన పనులన్నింటిని చేయిస్తున్నారని వారితో ఇలాంటి పనులు చేయించడం ఎంతవరకు సమంజసం అని ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కదిరి రూరల్ మండలం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయడానికి ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు త్వరలో వస్తున్న సందర్భంగా కొంత మంది ఆశాలతో ఆసుపత్రిలో పనులు చేయిస్తున్నారు. గోడలకు రంగులు వేయించడం, మరుగుదొడ్లు, బాత్రూములు కడిగించడం చెత్త, పిచ్చి మొక్కలు తొలగించడం లాంటి పనులు వారితో చేయిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి హాస్పటల్ మెయింటినెన్స్ కోసం వేల రూపాయలు మంజూరు అవుతాయని ఆ నిధులతో వర్కర్లను నియమించుకుని చేయించాల్సింది పోయి ఆ నిధులను దొంగ బిల్లులతో స్వాహా చేసి ఆశావర్కర్లతో ఈ పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఆశా వర్కర్లతో ఇలాంటి పనులు చేయించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి అధికారులపై ఉన్నత అధికారుల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఆశావర్కర్ల జాబ్‌చార్ట్ కోసం సిఐటియు డిమాండ్ చేయగా డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ఆ చార్టు ఇచ్చారని చెప్పారు. ఆశాలతో ఎలాంటి పనులు చేయించాలో సర్కులర్‌లో ఉన్నప్పటికీ అధికారులు వారి స్వలాభం కోసం ఆశా వర్కర్లతో ఇలాంటి పనులు చేయిస్తున్నారని విమర్శించారు. వారితో ఇలాంటి పనులు చేయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాలలో తాగునీటి సమస్య

బోరువద్ద నీటిని పట్టుకుని తాగుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 550 మంది విద్యార్థులున్నారు. వారికి పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవటంతో ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో నీటిని తీసుకు వెళ్లి వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. పాఠశాలలో నీటి వసతి కల్పించకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఉప్పునీటి తోనే సరిపెట్టుకుంటున్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులు కొంతమంది రక్షిత మంచినీరు లేకపోవడంతో కలుషితమైన నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాక మధ్యాహ్నం అందించే పౌష్టికాహారం సైతం సరిగా అందించలేదని దీంతో చాలామంది విద్యార్థులు ఇళ్ల నుండి భోజనం తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది. ఆరుబయటే వంట తయారు చేయడం వలన, కలుషితమయ్యే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆదర్శ పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడం వాస్తవమేనని అన్నారు. రక్షిత తాగునీటి ఏర్పాటుకు ఎవరైనా దాతలు ముందుకు వస్తే ఆర్ఓ ప్లాంట్ వేయించి రక్షిత తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వంటగది లేని కారణంగా ప్రస్తుతం ఆరుబయటే వంట చేస్తున్నామన్నారు.గతంలో సత్యసాయి నీటి పథకం ద్వారా నీరు అందేవని, కొద్ది రోజుల నుండి ఆ నీరు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారని వివరించారు.

ప్రజాపక్షపాతి 'ప్రజాశక్తి'

ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో మంత్రి సవిత

ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, ప్రజాశక్తి సిబ్బంది, తదితరులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాశక్తి దినపత్రిక ప్రజా పక్ష పత్రిక అని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం పట్టణంలోని మంత్రి స్వగృహంలో ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను మంత్రి ఆవిష్కరించారు. ప్రజాశక్తి బ్రాంచి మేనేజర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక కార్మిక, కర్షక, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న పత్రిక అని అన్నారు. ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తోందన్నారు. 44 ఏళ్లుగా దిగ్విజయంగా పత్రిక ప్రజల్లో ఉందని ఈ పత్రిక 44వ వార్షికోత్సవం జరుపుకోవడం శుభ పరిణామని అన్నారు. ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పెనుకొండ నియోజకవర్గ రిపోర్టర్లు ప్రకాష్ గౌడ్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, శ్రీనివాసులు, హరి, ప్రజాశక్తి సిబ్బంది శ్రీనివాసులు, నాగార్జున, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండల పార్టీ కన్వీనర్లు సిద్దయ్య, సిద్ధ లింగప్ప, నరహరి, గోవింద రెడ్డి, పెనుకొండ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని నేడు నిరసన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో బుధవారం నిర్వహించే శవయాత్ర నిరసన కార్యక్రమానికి ప్రజలు అధికారులు సహకరించి జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన ముదిగుబ్బ పంచాయతీలో శ్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాలకులు, నాయకులు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పకడ్బందీగా ఈ-పంట నమోదు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఖరీఫ్ సీజన్లో పంటలకు సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదు, జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో పాటు వివిధ శాఖలతో వంద రోజుల ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ పంట నమోదు 60 శాతం పూర్తయిందన్నారు. ఈ క్రాప్ నమోదుకు సెప్టెంబర్ 15 వరకు మాత్రమే సమయం ఉందని, ఈ లోగా పంట వివరాలు నమోదు చేయాలన్నారు. పంట నమోదు పూర్తి చేయడంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ అధికారులు వాటిని నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. ఈ పంట నమోదులో 60 శాతం కంటే తక్కువ మండలాలలో పురోగతి సాధించాలని తెలిపారు. ఈ- పంటలో కౌలు దారులకు చోటు పంట సాగు హక్కు పత్రాలు పొందిన రైతులకు నమోదులో అవకాశం కల్పించారు. ప్రకతి విపత్తుల వల్ల పంటలు నష్టపోతే ఈ వివరాల ఆధారంగానే బాధిత రైతులకు నష్టపరిహారం అందించనున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద, క్షేత్రస్థాయిలోనూ కౌలు రైతులకు, విత్తన ఉత్పత్తి రైతులకు ఈ-పంట నమోదుకు అవకాశం దక్కిందన్నారు. ప్రతిరైతు ముందుగా రైతు సేవాకేంద్రానికి వెళ్లి తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. సాగుచేసిన పంట వివరాలు, విస్తీర్ణం, సర్వే నంబరు, పట్టాదారు పాసుపుస్తకం తదితర వివరాలను తెలపాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు జిల్లాలో వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటర్ రీజన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, కోపరేట్ శాఖ అధికారి కృష్ణానాయక్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

అంగన్వాడీల పోరాటం చారిత్రాత్మకం : సిఐటియు

బుక్‌లెట్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా 42 రోజులు పాటు అంగన్వాడి వర్కర్లు చేసిన సమ్మె చారిత్రాత్మకమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ మాబున్నీ అధ్యక్షతన సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంగన్వాడీల సమ్మెకు సంబంధించి బుక్‌లెట్స్‌ను విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది అంగన్వాడీలు తమకు జరిగిన అన్యాయాలపై అకుంఠిత పట్టుదలతో తిరగబడ్డారన్నారు. అంగన్వాడీలు ఎన్ని రోజులు పోరాడతారని భీష్మించిన రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా సమరం సాగించారని చెప్పారు. ఈ ఉద్యమంలో ప్రతిక్షణం ప్రతిఘటనను లోతుగా పరిశీలించామన్నారు. 2024 జనవరి 21వ తేదీ క్లైమ్యాక్స్ నరాలు తెగే ఉత్కంఠ భరితంగా సాగిందన్నారు. ప్రభుత్వం ప్రతి ప్రాజెక్టులో అంగన్వాడీలకు డిస్మిస్ ఆర్డర్లు పంపిందని. ఆఖరి అవకాశమని వెంటనే డ్యూటీలో చేరిపోండని లేకుంటే అదే రోజే కొత్తవారిని చేర్చుకుంటున్నామని బెదిరించిందన్నారు. అధికారులు నయాన, భయాన నాయకులకు ఫోన్లు చేసి మైండ్ గేమ్ ఆడారని అయినా అంగన్వాడీలు బెదరలేదని అన్నారు. పోలీసుల కళ్లుగప్పి "ఛలో విజయవాడ"లో చేరడానికి ఎన్ని పాట్లు పడ్డారో వర్ణనాతీతమని అన్నారు. విజయవాడలో అరెస్టయిన అనేక మంది పోలీస్ స్టేషన్లో బైఠాయించారని గుర్తు చేసుకున్నారు. జనవరి 23 రాష్ట్ర వ్యాప్త బంద్‌కు ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు ఇచ్చిన పిలుపు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిందన్నారు. దీంతో అంగన్వాడీ నాయకులు ఎక్కడున్నారని గ్రూప్ ఆఫ్ మినిష్టర్స్ వెతుక్కొని అదేరోజు రాత్రి చర్చలకు పిలిచి ఒప్పందం చేసిందన్నారు. గత 30 సంవత్సరాల్లో జరిగిన ఏ పోరాట సందర్భంగానూ ప్రభుత్వాలు ఒప్పందాలు చేయలేదన్నారు. ప్రభుత్వాధినేత తమకు నచ్చినప్పుడు వేతనాలు పెంచాలని పోరాటాలు చేసినప్పుడు పెంచకూడదనేది ప్రపంచ బ్యాంక్ ఆదేశమన్నారు. అయితే 2024 జనవరి అంగన్వాడీ పోరాటం ప్రపంచ బ్యాంకు సిద్ధాంతాన్ని తిరగ రాసిందని చెప్పారు. పోరాటాన్ని దిగ్విజయంగా నడిపిన అంగన్వాడీలకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీల మీద అలాగే ఇతర స్కీం వర్కర్ల మీద కాంట్రాక్ట్ ఉద్యోగాల మీద తొలగింపులకు వేధింపులకు గురి చేయడం సరైందికాదని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పడానికే అంగన్వాడీ వర్కర్స్ సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిఎస్. శ్రీదేవి తోపాటు 12 ప్రాజెక్టుల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

'మీపిల్లలుంటే ఇలానే చేస్తారా..?'

లేపాక్షి ఎంజెపి హాస్టల్ సిబ్బందిపై మంత్రి ఆగ్రహం

నిల్వ ఉన్న నీటిలో నడుస్తున్న మంత్రి

బాత్‌రూముల నిర్వహణపై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి - లేపాక్షి

మీ ఇళ్లల్లో పిల్లలను అపరిశుభ్రమైన వాతావరణంలో పెంచుతారా...పురుగుల అన్నం పెడతారా..? అని లేపాక్షి రాష్ట్ర బీసీ, సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి సవిత ఎంజేపీ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది, వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం లేపాక్షి ఎంజేపీ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులను, బాత్ రూములను మంత్రి పరిశీలించారు. బాత్ రూములకు డోర్లతో పాటు విద్యుత్ సదుపాయం కూడా లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. చుట్టు పక్కల అపరిశుభ్రత వాతావరణం ఉండడంపైనా పారిశుధ్య సిబ్బందిపై మండిపడ్డారు. బాత్‌రూములను రోజుల తరబడి శుభ్రం చేయకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. హాస్టల్ చుట్టు నీరు నిల్వ ఉంటోందని, విద్యార్థులు పొరపాటున జారిపడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపల్ ను, వార్డెన్ ను మంత్రి ప్రశ్నించారు. తాగునీటి ట్యాంకులు కూడా అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లల్లో ఇలాగే ఉంచుతారా... మీ పిల్లలతో ఇలాంటి నీరు తాగిస్తారా..? అంటూ పారిశుధ్య, రెసిడెన్షియల్ సిబ్బందిపై మండిపడ్డారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలని, ఎప్పటికప్పుడు వేడి ఆహారం వండి పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. బయట ఆహారాన్ని హాస్టల్ లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దన్నారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులను ఇంట్లో పిల్లల మాదిరిగా చూసుకోవాలని సూచించారు. హాస్టల్‌పై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకు ముందు మంత్రి సవిత తనిఖీకి వస్తుందని తెలుసుకున్న సిబ్బంది అప్పటికప్పుడు హాస్టల్ పరిసరాలను నీటితో శుభ్రం చేయడం ప్రారంభించారు. ఈ దృశ్యాన్ని చూసి మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తానొచ్చానని ఇపుడు శుభ్రం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై మండిపాటు

మంత్రి సవిత హాస్టల్‌లోని స్టోర్ రూమ్ ను, డైనింగ్ హాల్ ను, వంట గదిని కూడా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. స్టాక్ రిజిస్టర్లలో సరుకుల వివరాలు చూపకపోవడంపై మండిపడ్డారు. నెల రోజుల నుంచి రిజిస్టర్లలో సరకుల వివరాలు పొందుపర్చక పోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. బియ్యం బస్తాలను పరిశీలించగా పురుగులు ఉండడాన్ని మంత్రి గమనించారు. ఇటువంటి బియ్యాన్ని పిల్లలకు వండి పెడుతున్నారా అంటూ వార్డెన్ పై ఫైర్ అయ్యారు. బియ్యాన్ని బాగా శుభ్రం చేసిన తరవాతే విద్యార్థులకు వండిపెట్టాలని ఆదేశించారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్లలో సరకులు వివరాలు ఎప్పటికప్పుడు పొందుపర్చాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని మంత్రి తిని రుచి చూశారు. ప్రభుత్వం సూచించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని స్పష్టంచేశారు. అనంతరం తరగతుల గదులతో పాటు విద్యార్థులు విశ్రాంతి తీసుకునే హాస్టల్ గదులను, బెడ్లను మంత్రి సవిత పరిశీలించారు. హాస్టల్ గదుల్లో విద్యుత్ సదుపాయంతో పాటు ఫ్యాన్లు లేకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గాలి, వెలుతురు లేకుండా విద్యార్థులు ఎలా పడుకుంటారని వార్డెన్ ను నిలదీశారు. తక్షణమే గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు.

భయంలేకుండా ఫిర్యాదు చేయండి

ఈసందర్భంగా మంత్రి హాస్టల్ సిబ్బందని బయటపెట్టి తరగతి గదుల తలుపులు వేసి విద్యార్థులతో మంత్రి సవిత మాట్లాడారు. 'సిఎం చంద్రబాబునాయుడు ...మీ బాగోగుల కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారని, ప్రతి రూపాయి కూడా మీకు చేరాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశమని' అన్నారు. భోజనం సరిగ్గా పెడుతున్నారా... చదువు బాగా చెబుతున్నారా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏయే ఆటలు ఆడుతున్నారని ఆరా తీశారు. ఏ చిన్న సమస్య ఉన్నా తనతో చెప్పాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. సమస్యలను స్వయంగా చెప్పలేకపోతే...తన ఫోన్ నెంబర్ కు కాల్ చెప్పాలని విద్యార్థులకు మంత్రి ఫోన్ నెంబర్ ఇచ్చారు. భయం లేకుండా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామ్ సుందర్, హాస్టల్ సిబ్బందితో పాటు టిడిపి నాయకులు జయప్ప, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ చూపిస్తే టోల్ ఫీజు మినహాయింపు

ప్రజాశక్తి - అగళి

అగళి, రొళ్ల, మడకశిర ప్రాంత ప్రజలు రొళ్ల టోల్‌గేట్ వద్ద ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారని స్థానికులు తెలిపారు. శిరా నుండి వయా అగళి, రొళ్ల, మడకశిర, పరిగి మీదుగా కోడికొండ చెక్ పోస్ట్ వరకు నేషనల్ నేషనల్ హైవే రోడ్డు ప్రారంభమైందన్నారు. రెండు నెలల నుంచి రొళ్ల వద్ద టోల్‌గేట్ ప్రారంభించారని చెప్పారు. అయితే రొళ్ల టోల్ గేట్ దగ్గర స్థానిక వాహన దారుల దగ్గర టోల్ ఫిజ్ వసూలు చేస్తున్న విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి మడకశిర ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన టోల్‌గేట్ అధికారులతో మాట్లాడారన్నారు. అగళి, రొళ్ల, మడకశిర మండల ప్రజలు ప్రభుత్వం కేటాయించిన ధరలకే రోడ్డు ఏర్పాటుకు భూములు ఇచ్చారని ఇప్పుడు వారికి సంబంధించిన నాలుగు చక్రాల వాహనాలకు టోల్‌గేట్ వసూలు చేస్తున్నారని ఈ వసూలును ఆపాలని వారితో చర్చించారని చెప్పారు. దీంతో టోల్ గేట్‌లో ఉన్న ఉద్యోగులు అంగీకరించారన్నారు. స్థానికులు ఆధార్ కార్డు చూపిస్తే టోల్ గేట్ ఫీజ్ వసూలు చేయమని చెప్పారని వివరించారు. నాలుగు చక్రాల వాహనాలు ఉన్న వారు తమ ఆధార్ కార్డు చూపించాలని వారికి టోల్ దగ్గర ఫీజు మినహాయింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ తమకు చెప్పారన్నారు.

నేడు బెహలూల్ షా ఖాద్రీ గంధం

పెనుకొండ టౌన్ : పట్టణానికి సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన ఉన్న బెహలూల్ షా ఖాద్రీ 827వ గంధం వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి ఆదోని షెక్షావలీ తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ సెప్టెంబర్ 27న జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. 28న గంధం, 29న దీపారాధన కార్యక్రమం జరగనుంది. మత సామరస్యానికి ప్రతీకగా స్వామి వారి గంధం ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది తరహాలోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రొద్దం : మండలంలోని రొద్దం పాత ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త నమస్కారాల వెంకటేష్ (45) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారధి అల్లుడు శశిభూషన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నప్పయ్య, కొట్టాల నారప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి రూరల్ : ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆసంస్థ జిల్లా అధ్యక్షులు నల్లజోడు పవన్ అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు మద్దతుగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరు మార్చుకొని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, అరుణ్, మహేంద్ర, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ క్రీడా దినోత్సవం

కొత్తచెరువు : ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లాలోని ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని సత్యసాయి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ డిఇఓ మీనాక్షిని కోరారు. యువతలో స్ఫూర్తిని నింపడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు ఆ రోజున క్రీడాకారులను సన్మానిస్తున్నట్లు చెప్పారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ముదిగుబ్బ : మండలంలోని మంగళ మడక గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు వెంగముని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు బుధవారం వెంగముని మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నల్లచెరువు : సీజనల్ వ్యాధులు ప్రధానంగా విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి సిహెచ్‌ఓ రామచంద్రారెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. డ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని ప్రజలకు చెప్పారు. ఆ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి ఆశా వర్కర్ ఖాదర్‌బీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గోరంట్ల రూరల్ : మండలంలోని వానవోలు గ్రామపంచాయతీ ఉగ్రహారం పల్లి ప్రాథమిక పాఠశాలలో ఫేస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కంటిపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బొగ్గ సురేష్, ప్రవల్లిక, సుధాకర్, లిఖిత, సాయి మోహన్, అమత వర్షిణి, దేవరాజ్, పాఠశాల హెచ్‌ఎం నాగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - గుడిబండ

హిందూపురం తూనికల కార్యాలయ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో తూనికల సిబ్బంది మంగళవారం గుడిబండ మండలంలోని దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వివిధ గ్రామాల్లోని ఎఫ్‌ఇ షాపులు, దుకాణాలు తనిఖీ చేసి తూనికల స్కేళ్లను రాళ్లను పరిశీలించారు. సీలు వేయించని తూనికల స్కేళ్లు, రాళ్లను గుర్తించి అపరాధ రుసుం విధించి నోటీసులు అందజేశారు. తూనికల స్కేళ్లకు, రాళ్లకు సీలు వేయించని వారు హిందూపురంలోని తూనికల కార్యాలయానికి తీసుకొచ్చి సీలు వేయించాలని ఇన్స్‌పెక్టర్ శివశంకర్ తెలిపారు.

వాలంటీర్లకు వేతనాలివ్వండి

ప్రజాశక్తి - మడకశిర

రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లకు వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని పట్టణంలోని 17వవార్డు కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి నెలా 5వ తేదీ లోపు గ్రామ, వార్డు వాలంటీర్లకు వేతనాలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేసేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ, వార్డు వాలంటీర్లకు వేతనాలు మంజూరు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే గ్రామ, వార్డు వాలంటీర్లకు వేతనం రూ. 5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు వేతనం చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వాలంటీర్ల కష్టాలను గుర్తించి వెంటనే వేతనాలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసి ఆదుకోవాలి వారు కోరారు.

రెవెన్యూ సదస్సులకు సిద్ధం : కలెక్టర్

టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

త్వరలో జరిగే రెవెన్యూ సదస్సులకు తగిన ప్రణాళికలతో సిద్ధంగా కావాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరిగే గ్రామ సదస్సులు, ఉపాధి హామీ పథకం, ఎన్టీఆర్ భరోసా, సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డిపిఒ విజయకుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. ప్రజల వద్దకే పాలన తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. త్వరలోనే తేదీలను ప్రకటిస్తామన్నారు. రెండు రోజుల ముందే రెవెన్యూ మ్యాప్‌లను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. సదస్సులకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అటవీ, దేవాదాయ, వక్ఫ్ శాఖల అధికారులతో పాటు మండల, గ్రామస్థాయి అధికారులందరూ పాల్గొనాల్సి ఉంటుందన్నారు. భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్ల మార్పులు, సరిహద్దు సమస్యలు, విస్తీర్ణంలో తేడాలు, రికార్డులలో తప్పులు తదితర అంశాలపై చర్చలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా పనులు కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. ధర్మవరం, ముదిగుబ్బ ప్రాంతాల్లో 5 వేల ఎకరాల్లో గుంతలు తవ్వే పనులు చేపట్టాలన్నారు. ప్రతిరోజు డిపిఒ ఆధ్వర్యంలో చేపట్టవలసిన పనులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలన్నారు. 1వ తేదీన ఉదయం 5:30 గంటలకే పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. జేసీ మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ మోటార్ల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణ పరిసర ప్రాంతాలలో ఇంటికి నీరు తోడే మోటర్లు ఎత్తుకెళ్లిన దొంగను అరెస్టు చేసినట్లు సిఐ సునీత తెలిపారు. ఇంటికి అవసరమయ్యే నీటిని తోడే మోటార్లను దొంగలించిన కుంచపు గురుమూర్తి అనే వ్యక్తిని అరెస్టు చేసి సొమ్ము రికవరీ చేశామన్నారు. మొత్తం 19 మోటార్లకు గాను 16 మోటార్లను రికవరీ చేశామని వాటి విలువ రూ. 94 వేలు ఉంటుందని అన్నారు. నల్లమాడ మండలానికి చెందిన ఈ నిందితుడు స్వతహాగా ఎలక్ట్రీషన్ కావడంతో సులభంగా ఇంటి ముందర ఉన్న మోటార్లను రాత్రి సమయంలో ఎత్తుకెళ్లేవాడన్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం ప్రశాంతి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసును ఛేదించిన ఎఎస్‌ఐ గంగన్న, పోలీస్ సిబ్బంది మధు, మురళి, కొండారెడ్డి, రామాంజి, నరసింహ, తదితరులను సిఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణ సమీపంలో పులేకమ్మ గుడి వద్ద కారు బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... హైదరాబాద్‌కు చెందిన వెంకటేష్, జయంతి(67) అనే భార్యాభర్తలు బెంగళూరుకు సొంత కారులో బయలుదేరారు. మార్గంమధ్యలో పులేకమ్మ గుడి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయంతి అక్కడికక్కడే మృతిచెందింది.కారు డ్రైవ్ చేస్తున్న వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రం సమీపంలో ఉన్న రెండు దుకాణాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కదిరి రాయచోటి ప్రధాన రోడ్డు పక్కన ఉన్న గుజిరి దుకాణం, రేకుల షెడ్డు దుకాణంలో చోరీ జరిగినట్లు బాధితులు మహమ్మద్ రఫీ, నాగరాణి మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుజిరి దుకాణంలో సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేసి ఏసి మోటర్ చోరీ చేశారని బాధితుడు మహ్మద్ రఫీ వాపోయారు. దీంతో తనకు దాదాపు 15 వేల రూపాయలు నష్టం కూరిందన్నారు. రేకుల షెడ్డు దుకాణంలో రెండు గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉండే ఒక సిలిండర్‌ను, తినుబండారాలను ఎత్తుకెళ్లారని బాధితురాలు నాగరాణి వాపోయారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు.

శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిచ మండల నోడల్ ఆఫీసర్ సుబ్బారావు తెలిపారు. కొత్తచెరువులోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన జరగబోయే ఐదు సంవత్సరాల ప్లానింగ్ గురించి చర్చించారు. మండలంలోని రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, ఉపాధి హామీ, ఐకెపి ,హౌసింగ్, గణాంకాలు, మొదలైన వాటిపైన ప్రణాళికలు ఆయా శాఖల వారీగా సిద్ధం చేయాలన్నారు ఈ కార్యక్రమాన్ని త్వరతిగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బారాన్‌సాహెబ్, వ్యవసాయ శాఖ అధికారి నటరాజు, ఎపిఒ నాగిరెడ్డి, ఎపిఎం రమణారెడ్డి, ఎఎస్‌ఒ గంగాధర్, ట్రాన్స్‌కో ఎఇ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : వికసిత్ ఆంధ్ర 2047 ప్రణాళిక లో బాగంగా 5 సంవత్సరాల (2024-29) ప్రణాళికను సంబందిత శాఖల ద్వార తయారు చేయుటకు మండల అదికారులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి షేక్ అబ్దుల్ ఖయూం, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ మాట్లాడుతూ ప్రణాళికను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి అందజేయాలని సుచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

స్టాంపుల సేకరణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు స్టాంపుల సేకరణ పై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టాంపుల సేకరణ పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు తపాలా శాఖ ఇప్పటికే ఎన్నో చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. విద్యార్థుల్లో మరింత అవగాహన కల్పించాలని ఉద్దేశంతో దీన దయాల్ స్పర్శ యోజన పథకం కింద ఉపకార వేతనాన్ని అందజేసేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రత్యేక అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహించే అర్హత పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అర్హులని, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఐదు శాతం మినహాయింపు ఉంటుందని అన్నారు. ఈ పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి రూ 6. వేల ఉపకార వేతనం అందజేయడం జరుగుతుందన్నారు. రూ. 200 డిపాజిట్ తో ఆసక్తి ఉన్న విద్యార్థులు వారి పాఠశాల ప్రిన్సిపల్ సంతకంతో కూడిన ధ్రువీకరణతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను కర్నూలు తపాలా కార్యాలయానికి పంపాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు పూర్తి వివరాల కోసం హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన వివరించారు.

విధి నిర్వహణలో సాంకేతికతను ఉపయోగించాలి : ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసులు తమ దినచర్యలో భాగంగా రోజువారి సమాచారాన్ని టెక్నాలజీని, స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి ద్వారా విధి నిర్వహణలో కొత్త ఒరవడులు సృష్టిస్తూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ.రత్న సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో ఉన్న సబ్ డివిజన్, సర్కిల్, పోలీస్ స్టేషన్లో పనిచేసే రైటర్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. స్టేషన్ పరిధిలో జరిగే రోజువారి కార్యక్రమాలు ఎలా పంపించాలి, డిజిటల్ అప్లికేషన్లు ,టెక్నాలజీ గురించి ఒకరోజు వర్క్ షాప్ (అవగాహన) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు రోజువారి కార్యక్రమాలు, ఆఫీస్ వర్క్ డ్రాఫ్టింగ్ ఎలా ఉండాలి, వాటిని డిజిటల్ అప్లికేషన్లు ద్వారా ఎలా ఫోల్డర్లు నింపి పంపించాలన్న విషయాలను వివరించారు. డిసిఆర్‌బి సిబ్బంది ప్రతి వారం సమాచారాన్ని తెలియపరచాలని సూచించారు. జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏమి జరిగింది ఎప్పుడు జరిగింది ,ఎక్కడ అన్న విషయాలను పూర్తి సమాచారం సంక్షిప్తంగా చేసుకొని ఎలా పంపాలన్న విషయాలను తెలియజేశారు. టెక్నాలజీ పరంగా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకునే విధంగా చూడాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఎఆర్ డీఎస్పీ జెడ్. విజయ్ కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐలు సతీష్, శ్రీనివాసులు, ఎస్‌బి ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని ఈదుల ముష్టూరు, పెద్ద కొట్టాల (బీసీ కాలనీ) గ్రామాల్లో ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాత కక్షలు మనస్సుల్లో ఉంచుకుని గొడవలు, బెదిరింపులకు దిగడం లాంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించేవారి సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రౌడీ షీటర్లు, గత కేసుల్లో నిందితులకు ఈసందర్భంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమంగా మద్యం విక్రయించేవారి నివాసాలుచ అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐలు తిరుపాలు, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని శాంతినికేతన్ హై స్కూల్‌లో ప్రైవేట్ పాఠశాలల జిల్లా సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశం అపోస్మా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వేణుగోపాల్ రావు, శ్రీ సత్య సాయి జిల్లా సెక్రటరీ ఎస్.రియాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పెనుకొండ అసెంబ్లీ జోన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా ఎం. లక్ష్మీపతి, గౌరవాధ్యక్షులుగా ఘనగిరి ఇలియాజ్, కార్యదర్శిగా జె . శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారిగా పిఎన్. రాజు, ఉపాధ్యక్షులుగా కెవి. మల్లికార్జున, ఇసి సభ్యులుగా పి .మౌలాలి, ఆర్కే తిమ్మారెడ్డి, ఉదిత్ ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ సమావేశానికి ఆయా మండలాల నుండి వివిధ ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

సిఎం హామీల అమలుపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

ఈ నెల ఒకటవ తేదీన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి గుండుమల గ్రామానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలుపై స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తదితరులు మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చేతన్‌ను కలిసి సిఎం ఇచ్చిన హామీల అమలుపై చర్చించారు.

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : మండల పరిధిలోని అచ్చంపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామంజప్ప, రామకృష్ణ, నాగరాజు, బొజ్జప్ప, మంజునాథ్, అశ్వర్థప్ప, సురేష్ బాబు, ఎస్ మంజునాథ్ తదితరులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలోకి చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, రవికుమార్, రంగనాథ్, సురేష్, కాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ కళాశాలల్లోని వసతులను ఉపయోగించుకొని, నిష్ణాతులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి పిలుపునిచ్చారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు మంగళవారం మహిళా కళాశాలలో నూతన విద్యార్థినులకు పరస్పర పరిచయ, ప్రేరణా తరగతుల కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రేరణ కార్యక్రమాల సమన్వయకర్త డాక్టర్ యశోదాదేవి ఆధ్వర్యాన నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థినులకు పలు విషయాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేశులు, ఐక్యూఎసి. సమన్వయకర్త డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు పార్వతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు వదిలితే కేసులు : కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా రోడ్లపై పశువులను వదిలితే ఆ పశువుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలో విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతున్న పశువులను తరలించడానికి మంగళవారం పురపాలక శాఖ తరపున ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు ప్రధాన రహదారుల్లో పశువులు గుంపులు గుంపులుగా పశువులు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా రోడ్లపై ఉన్న పశువులను పట్టి ప్రత్యేక వాహనంలో తరలిస్తునానమన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా ఫొటోగ్రాఫర్స్ కమిటీ మెంబర్‌గా విజయ్ కుమార్

ప్రజాశక్తి - కొత్తచెరువు

అనంతపురం వేదికగా సెప్టెంబర్ ఐదు నుంచి 22 వరకు జరిగే దులీప్ ట్రోఫీకి మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ ప్రెస్ అండ్ పబ్లిసిటీ మీడియా ఫోటోగ్రాఫర్స్ కమిటీ మెంబర్‌గా ఎన్నికయ్యాడు. దులీప్ ట్రోఫీ టోర్నమెంట్లో విజయ్ కుమార్ మీడియాకు సంబంధించిన కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ మధు ఆచారి తెలిపారు. విజయ్ కుమార్ దులీప్ ట్రోఫీకి ప్రెస్ కమిటీ మెంబర్‌గా ఎన్నిక కావడం పట్ల మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు రాజీవ్, శ్రీనివాసులు, భాస్కర్ బాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విజయ్‌కుమార్